రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ మళ్లీ వెలుగుచూడటం ఆందోళనకర విషయం. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కింది తరగతి వారిని శారీరకంగా,మానసికంగా పైతరగతి విద్యార్థులు వేధిస్తూ పైశాచిక ఆనందం పొందడం దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు శంకర్ పల్లి రాజేంద్రనగర్, బాసర ఆర్జీయూకేటీలో ఈ నెలలోనే మూడు చోటు చేసుకోవడం ర్యాగింగ్ తీవ్రత ఎలాఉందోఅద్దంపడుతోంది.దీన్నికట్టుదిట్టం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలు కఠినంగా అమలు చేయాలి. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులను ఎక్కడా చదువుకోకుండా జీవితకాలం నిషేధం విధించాలి. ఏ విద్యాసంస్థల్లో చేర్చుకోకుండా ఆదేశాలివ్వాలి. అంతేకాకుండా విచారణ జరిపి జైలు శిక్ష, జరిమానా బేషరతుగా విధించాలి.

-తలారి గణేష్, వెల్లంకి, యాదాద్రిజిల్లా

### ప్రజాధనం వృధాకాదా?

రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేపట్టిన వివిధ దశల్లో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయకుండా ఏవేవో సాకులు చెబుతూ కాలయాపన చేయడంతో ఎంతో ప్రజాధనంవృధా అవుతున్నది. రాజధాని అమరావతిలో అన్నీపాడు పెట్టారు. వివిధ దశల్లో ఉన్న 30లక్షల గృహ నిర్మాణాలను పూర్తిచేయలేదు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా కుప్పిగంతులు వేస్తున్నారు. ఆయా నిర్మాణాలు రాష్ట్రప్రగతి కోసం, ప్రజల అవసరాల కోసం ప్రజల డబ్బుతో చేపట్టినవి.పాలకుల్లో విజ్ఞతలోపించివితండ, బాధ్యతారాహిత్య వాదనలతో తిరోగమన విధానాలతో రాష్ట్రాని భ్రష్టుపట్టించారు. ఈవిధంగా ప్రజావ్యతిరేక పాలన సాగుతు న్నా ఏ మేధావీ నోరువిప్పడంలేదు.వారి రహస్యఎజెండాఏమిటో మరి?

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### మంచి సినిమాలు రావాలి

ఎంత కాదనుకున్నా సినిమా, క్రికెట్ మన జీవితంలో ఒక భాగం అయ్యాయి. సినీ పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది ప్రత్యక్షంగా, లక్షలాదిమంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. మంచి సినిమాలు వస్తే జనం వాటిని ఆదరిస్తారు. మంచి కథ, కథనం లేకపోతే భారీ బడ్జెట్‌తో తీసిన చిత్రాలు అయినా పరాజయాన్ని మూటగట్టుకుంటాయి. సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వీటిపైన సినిమాలు తీస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. ప్రేక్షకులకు ఒక మంచి మెసేజ్ ఇచ్చే సినిమాలు వస్తే యువత కూడా మంచిదారిలో పయనిస్తుంది.

-యం.రాంప్రదీప్, తిరువూరు


**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# రిజర్వేషన్లలో 'వెనుకబాటు'ను సమీక్షించాలి

*గతంలో స్థానిక పరిపాలనాసంస్థల్లో ఓబిసిలకు రిజర్వేషన్లు,విద్యా,ఉద్యోగాలలో వ్యవసాయకులాలు, మతపరమైన మైనారిటీలకు రిజర్వేషన్లతోసహా వివిధ సామాజిక విధానాలను అమలుపరచడంలో మొత్తంకల్పించే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని గతంలోనే ఆయా రాష్ట్రాల హైకోర్టులు స్పష్టం చేశాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పు ఆ గరిష్ట పరిమితిని పట్టించుకోనట్లే కదా! ఇటువంటి పరిస్థితుల్లో అగ్రకుల పేదలకు, ఆర్థిక వెనుకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతికై అమలుపరుస్తున్న అనుకూల చర్యల పరిస్థితి విచ్ఛిన్నమవ్వడానికి దారితీసే ప్రమాదం ఎంతైనా ఉంది.*

**చిమ్మె.జాన్‌బర్నబాస్**

విద్యలో, ఉద్యోగాలలో పదిశాతం రిజర్వేషన్ అగ్రకుల పేదలకు ఇవ్వడం రాజ్యాంగబద్ధమేనంటూ 7నవంబర్ 2022న భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఈ కోటా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఏ విధంగానూ దెబ్బతీయదనీ, రాజ్యాంగ విలువలకు కట్టుబడే ఉందనే భావనతో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భిన్నాభిప్రాయాలతో కూడుకొన్నది. ఐదుగురు జడ్జీలలో ఇద్దరు ఇచ్చే తీర్పులో తమ వ్యతిరేకతను కూడా తెలియచేశారు.మెజారిటీ నిర్ణయం మేరకు తీర్పును చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ యు.యు లలిత్ నేతృత్వంలో దినేశ్ మహేశ్వరి వెల్లడి చేశారు. ప్రధాన న్యాయమూర్తి ఎస్‌సి/ఎస్‌టి/ఒబిసి పేదలను విస్మరించడం సరికాదనే భావనతోనే ఉన్న ఇద్దరు సభ్యులలో ఒకరు. మరొకరు జస్టిస్ రవీంద్ర భట్. వీరు 103వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. సమాన అవకాశాలు ప్రయోజనాలు కల్పించడానికి రిజర్వేషన్లను ఒక శక్తివంతమైన ఆయుధంగా రూపొందించారు. ఇప్పుడు కొత్తగా ఆర్థిక కొలమానాల ఆధారంగా రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం ఆమోదయోగ్యమే. అయితే ఎస్‌సి/ఎస్‌టి/ఒబిసిలు ఇప్పటికే రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారన్న ఒకే కారణంతో వారిని ఈ రిజర్వేషన్ల నుంచి మినహాయించడం కొత్తగా అన్యాయం చేయడమే. వీరు సమాజంలో నిరుపేదలుగా ఉన్నప్పటికీ ఇతరుల పేరుతో ఈ రిజర్వేషన్ల పరిధి నుంచి మినహాయించారు. వాస్తవానికి కులం, తరగతితో సంబంధం లేకుండా అత్యంత నిరుపేదలను దీని పరిధిలోనికి తీసుకోవాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం అగ్రకులాలకు మాత్రమే అవకాశం కల్పించినట్లయింది. రాజ్యాంగపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తింపు పొందిన ప్రజలను పూర్తిగా ఈ రిజర్వేషన్ల నుంచి విస్మరించడం వివక్ష తప్ప మరొకటి కాదు. ఇది సమానత్వ సిద్ధాంతాన్ని ధ్వంసం చేస్తోంది.అందువల్ల 103వ రాజ్యాంగ సవరణ ఏకపక్షంగా ఉంది అంటూ జస్టిస్ రవీంద్రభట్ తన భిన్నాభిప్రాయాన్ని తెలియచేశారు. దానికి చీఫ్ జస్టిస్ యుయు లలిత్ ఏకీభవించారు. మిగతా సభ్యులైన జస్టిస్ జె.బి. పార్థీవాలా,జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ బేలా.ఎం.త్రివేదిలు అగ్రకులాలకు పదిశాతం రిజర్వేషన్లు ఉండాలనే భావనతో ఉన్నప్పటికీ మొత్తం రిజర్వేషన్ల విధానం పట్ల తమతమఅభిప్రాయాలను తెలియచేశారు. 'సమాజంలో అసమానతలనేవి ఉన్నప్పుడు సమతుల్య సమాజాన్ని సాధించే లక్ష్యంతో అందరినీ కలుపుకొని పోవడానికి ప్రభుత్వపరంగా తీసుకున్న దృఢమైన చర్యే రిజర్వేషన్ అని జస్టిస్ దినేశ్ మహేశ్వరి అభిప్రాయం వ్యక్తం చేశారు.అది సామాజికంగా, విద్యాపరంగా, వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకొని రావడానికి ఉద్దేశించిన పరికరమొక్కటే కాదు, ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న ఏతరగతినైనా, వర్గాన్ని అయినా చేర్చుకొని వారి బలహీనతకు పరిష్కారం చూపే మార్గం కూడా. ఈ నేపథ్యంలో కేవలం ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగంలోని ఏముఖ్యమైన లక్షణాన్నీ ఉల్లంఘించదు. ఇప్పుడున్న రిజర్వేషన్లకు అదనంగా ఆర్థికంగా బలహీనవర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించడం వలన 50శాతం రిజర్వేషన్లు పరిమితిని అధిగమించినప్పటికీనీ అది రాజ్యాంగ సిద్ధాంతాలకు నష్టం చేకూర్చదు అని అన్నారు. ఇందుకు కారణం ఆ సీవింగ్ పరిధి మార్చడానికి వీలులేనిది కాకపోవడమే. ఆ సీవింగ్ కేవలం అధికరణం 15(4), 15(5), 16(4)ల కింద కల్పించిన రిజర్వేషన్లకు మాత్రమే వర్తిస్తుంది అని పేర్కొన్నారు.అలాగే జస్టిస్ జె.బి పార్థీవాలా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ రిజర్వేషన్లు అనేవి సామాజిక, ఆర్థిక న్యాయం చేయడానికి ఉన్నవి.అవి స్వార్థ ప్రయోజనంగా మారే అవకాశమివ్వకూడదు. వెనుకబడిన తరగతులకు చెప్పుకోదగ్గ స్థాయిలో





విద్య,ఉద్యోగాల్లో ఆమోదయోగ్యమైన ప్రమాణాలను అందుకున్నారు. అందువలన వారిని వెనుకబడిన తరగతుల జాబితాలోనుంచి తొలగించాలి. తద్వారా నిజంగా సాయం అవసరమైన వారిపై దృష్టి పెట్టడానికి వీలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వెనుకబడిన తరగతులను నిర్ధారించే మార్గాలను గుర్తించే విధానాలను సమీక్షించాల్సిన అవసరం చాలా ఉంది. స్వార్థ ప్రయోజనాలుగా మారేలా రిజర్వేషన్లు నిరవధికంగా కొనసాగకూడదు అంటూ పేర్కొన్నారు. అలాగే జస్టిస్ బేలా ఎం. త్రివేది అభిప్రాయం వ్యక్తం చేస్తూ పై ఇరువురి అభిప్రాయాలతో ఏకీభవించిన జస్టిస్ బేలా ఎం.త్రివేది రిజర్వేషన్లను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. 75ఏళ్ల స్వాతంత్ర్యానంతరం సమాజ విస్తృత ప్రయోజనాలదృష్ట్యా మొత్తం రిజర్వేషన్లను పునఃపరిశీలించాలి. 2020లో 104వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్,శాసనసభల్లో ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లు రద్దుచేశారు. అదే తరహాలో రాజ్యాంగంలోని అధికరణ15,16 కింద కల్పించిన రిజర్వేషన్లు, ప్రాతినిధ్యాలకు నిర్దిష్ట గడువు విధిస్తే అది సమతుల్యమైన కుల,వర్గ రహితమైన సమాజానికి మార్గం సుగమమం చేస్తుంది అంటూ ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ తీర్పు భారత సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పాలకవర్గ దృక్పథానికి అనుకూలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ స్వభావానికి ప్రతిబింబించే విధంగా ఉన్నది. అందుకే భారతీయ జనతాపార్టీ పెద్దలు దీనిని స్వాగతించారు. భారత ఉన్నత న్యాయవ్యవస్థ చాలా కాలంగా అఫిర్మేటివ్ ఆక్షన్ లేదా కాంపెన్సేటరీ డిస్క్రిమినేషన్ భావనను సమర్థిస్తూ వచ్చింది. ముఖ్యంగాఎన్ఎమ్ థామస్ (1976), ఇంద్రసాహ్ని (199జీ) కేసులలో వెలువరించిన తీర్పులు ఈ విషయంలో మైలురాళ్లుగానిలిచిపోయాయి. రాజ్యాంగ నిర్దేశిత సమానత్వసూత్రానికి అనుగుణంగా ఉన్నత న్యాయస్థానాలు ఆ తీర్పులు వెలువరించాయి. అయితే ఆ భావనను అమలు పరిచేందుకు కొన్ని కఠినషరతులు విధించాయి. అవి ఏమనగా లబ్ధిపొందే సామాజికబృందాన్ని తార్కికంగా, నిర్ధాయకంగా నిర్వచించితీరాలి. ఆ సామాజిక సముదాయం ప్రతికూలతలు, అల్పప్రాతినిధ్యానికి గురవుతుందనడానికి గట్టిరుజువులు ఉండితీరాలి. రిజర్వేషన్ సదుపాయం కల్పించేందుకు ఇది తప్పనిసరి. రిజర్వేషన్ విధానంలో ఎటువంటి మార్పులు అయినాసరే వాటిపై మొత్తంగా విధించిన గరిష్ట పరిమితిని ఉల్లంఘించకూడదు. ఆమోదయోగ్యం కాని విధంగా అర్హత లేదా సమర్థతను కొత్తరిజర్వేషన్లు ప్రభావితం చేయకూడదు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పైనాలుగు అంశాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదనిపిస్తోంది.ఈడబ్ల్యుఎస్ కోటాలను సమకూర్చడంలోనూ,వాటివల్ల ఉత్పన్నమయ్యే సమస్యల గురించి అర్థం చేసుకోవడంలోనూ మెజారిటీ న్యాయమూర్తులు విఫలమైనట్లు అర్థం చేసుకోవచ్చు. వాస్తవంగా 2019లో ఈడబ్ల్యుఎస్ చట్టసవరణను తీసుకొచ్చిన తర్వాత ఒకసర్వే నిర్వహించారు. దేశవ్యాప్తంగా 445 ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులలో 28 శాతానికిపైగా అగ్రకులాల పేదలే అని నిర్ధారణ అయింది. పూర్వనిబంధనల ప్రకారం కల్పించిన రిజర్వేషన్లకు నిర్దేశితగరిష్ట పరిమితి యథాతథంగా ఉంటుందనడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైన విషయం. అది సమర్థనీయంకాదు. గతంలో స్థానిక పరిపాలనాసంస్థల్లో ఒబిసిలకు రిజర్వేషన్లు,విద్యా,ఉద్యోగాలలో వ్యవసాయకులాలు, మతపరమైన మైనారిటీలకు రిజర్వేషన్లతోసహా వివిధ సామాజిక విధానాలను అమలుపరచడంలో మొత్తంకల్పించే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని గతంలోనే ఆయా రాష్ట్రాల హైకోర్టులు స్పష్టం చేశాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పు ఆ గరిష్ట పరిమితిని పట్టించుకోనట్లే కదా! ఇటువంటి పరిస్థితుల్లో అగ్రకుల పేదలకు,ఆర్థిక వెనుకబాటుతనంప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతికై అమలుపరుస్తున్న అనుకూల చర్యల పరిస్థితి విచ్ఛిన్నమవ్వడానికి దారితీసే ప్రమాదం ఎంతైనా ఉంది. కాబట్టి ఇప్పుడివ్వబడిన సుప్రీంకోర్టు తీర్పుపాలకవర్గ, హిందూ ఫాసిస్ట్ దృక్పథాన్ని ప్రతిబింబించే విధంగాఉన్నదని స్థూలంగా చెప్పవచ్చు.అయితే ప్రజాస్వామికవాదులు,ఆయాసామాజిక వర్గాలు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పేదల అభ్యున్నతికై కొత్త రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామనే ఆర్థిక న్యాయాన్ని సుప్రీంకోర్టు వ్యక్తపరిచినప్పటికీనీ, మొత్తం పేద ప్రజలలో 81.5 శాతంగా ఉన్న ఎస్సీ,ఎస్టీ, ఒబిసిలోని నిరుపేదలను ఆ రిజర్వేషన్ల నుంచి మినహాయించడం పేదలలోని నిరుపేదలకు సమాన అవకాశాలను, సామాజిక న్యాయాన్ని నిరాకరించడమే అవుతుంది. ఇదే అసలైన ప్రజాస్వామిక, రాజ్యాంగ బద్ధమైన సూత్రీకరణ. ●

(రచయిత:ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్)

# సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం కృషి

**మిద్దె సురేష్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమానికై నిరంతరం పరితపిస్తూ వారి బంగారు భవిష్యత్తుకై ప్రణాళికలు రూపొందిస్తూ విద్యాశాఖలో ఉన్నతమైన మార్పులు తీసుకువస్తుంది. పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లీష్ మీడియంలో సకల వసతులతో గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తుంది తెలంగాణ సర్కారు. రాష్ట్రంలో వెనుకబడిన పేదవర్గాల వారికి ఉచిత విద్యను అందించాలని దృఢమైన సంకల్పంతో ముందుకుపోతూ రెసిడెన్షియల్ పాఠశాలలు వంటివి ప్రతియేటా పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కూడా సకలవసతులు కల్పిస్తూ బడిపిల్లలు బడిలోనే ఉండే విధంగా కఠినమైన నిబంధనలు అమలు చేస్తుంది. తెలంగాణలో కొత్తగా సైనిక స్కూల్ కేంద్రీయ విద్యాలయాలు వ్యవసాయ కళాశాలలు హెల్త్ యూనివర్సిటీలు అందుబాటులోకి తీసుకువచ్చి తెలంగాణ విద్యారంగం దేశానికే ఆదర్శంగా ఉండాలని ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్పు, బిసివిద్యార్థులు విదేశాలలో చదవడానికి మహాత్మాజ్యోతిరావు పూలే బిసిఓవర్సీస్ స్కాలర్‌షిప్పు, మైనారిటీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్ షిప్పు అందిస్తూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మెస్‌చార్జీల పెంపు వంటివి స్కూల్ విద్యార్థుల దగ్గరనుండి కాలేజ్ విద్యార్థుల దాకా వారి సంక్షేమానికి కృషిచేస్తూ మహాత్మాజ్యోతి రావుపూలే, అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణంగా అందరికి ఉచిత విద్య అందించాలని భావించి ప్రతియేటా నూతన గురుకులాలు, కళాశాలలు మంజూరు చేస్తూ ఈమధ్యన మెడికల్ కాలేజీలను ప్రారంభించి ఉన్నత విద్యతోపాటు విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రంలో ఐటిహబ్ ఏర్పాటు ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అనుగుణంగా నూతన విద్య పద్ధతులను చేకూరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాలు సాధ్యమైనంతవరకు అందించే ప్రయత్నం కూడా చేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలో ఫీజుల నియంత్రణకు కొత్త చట్టం తీసుకురావాలని తీర్మానించింది. ఆర్థికంగా పలు కారణాల ద్వారా పై చదువులకు దూరమైన వారి కోసం దూర విద్యాకేంద్రాలను తీసుకువచ్చింది రాష్ట్రప్రభుత్వం. ఉన్నత



విద్యకు సంబంధించిన యూనివర్సిటీలను సర్వసుందరంగా తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందిస్తుంది. గత ప్రభుత్వాలతో పోలిస్తే నేడు విద్యావ్యవస్థ మరింత పటిష్టం చేకూరిందని పలు నివేదికలు తెలుపుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో హాజరు శాతం కూడా గణనీయంగా పెరిగిందని అంటున్నారు. అదే విధంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని విద్యార్థులకు వేర్వేరుగా వసతి భోజన సౌకర్యంలో బిసి,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు క్లాసులు నిర్వహించడం, స్టడీ మెటీరియల్స్ అందిస్తూ స్టడీ సెంటర్‌ల ద్వారా నీట్ ఐఐటి వంటి ప్రవేశపరీక్షలకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఇది పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. తెలంగాణలో ఉన్న లైబ్రరీలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలందరికి పుస్తకాలను అందుబాటులో ఉండే విధంగా చూస్తూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో నూతన గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకుని సమర్థవంతంగా విద్యాసంస్థలను నిర్వహించి గడ్డుకాలం నుంచి బయటపడటం జరిగింది. ఆ సమయంలో విద్యార్థులు నష్టపోకుండా ఆన్‌లైన్ ద్వారా పాఠాలు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత పిల్లలకు కూడా దూరదర్శన్ ద్వారా పాఠాలు ప్రసారం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పలు నివేదికల్లో విద్యారంగానికి పలు అవార్డులు రావడంవిశేషం. మహిళ అభ్యున్నతికి నిరంతరం కృషిచేస్తున్న రాష్ట్రప్రభుత్వం ఈ మధ్యకాలంలో మహిళా యూనివర్సిటీని తీసుకురావడం జరిగింది. టిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు మరో తీపికబురు అందించింది.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల ఆరోగ్య, సంరక్షణ కోసం ఈ యేడాది నుంచే బడ్జెట్‌లో సిఎం కెసిఆర్ పాఠశాల, కళాశాలలో ఉచితంగా హెల్త్‌కిట్ల పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇందుకుగాను మొత్తం రూ.69.52 కోట్లతో హెల్త్‌కిట్ల కొనుగోలు పంపిణీ కోసం ప్రభుత్వ పరిపాలన అనుమతులు జారీ చేయడం జరిగింది. మహిళలు, వెనుకబడిన బలహీనవర్గాల వారి ఉన్నత విద్యకు రిజర్వేషన్ కల్పించింది తెలంగాణ సర్కార్. ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న పదవ తరగతి ఇంటర్మీడియేట్ విద్యార్థుల ఉత్తీర్ణత పెరుగుదలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంది. టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ మధ్యన 'మన ఊరు మన బడి' కార్యక్రమం ద్వారా కూడా ప్రభుత్వబడుల బలోపేతానికి కృషి చేస్తుంది. రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా ప్రయత్నిస్తుంది. ●

# సహనం ద్వారానే సమస్యలు పరిష్కారం

**రావుశ్రీ**

మనం అంతా బలహీనులం, తప్పులు చేసేవారం. పరస్పర అవగాహనతో అర్థం చేసుకొని, తప్పులు మన్నించుకుని, శాంతియుతంగా జీవించే మార్గం ప్రకృతి న్యాయం అని ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత ఓల్టేర్ తెలిపిన మాటలు వాస్తవమే కదా. ప్రతీ వ్యక్తి తన జీవితంలో ఏదో ఒక సమయంలో అసహనం ప్రదర్శించుట జగమెరిగిన సత్యం. కరెంట్‌పోయి, కంప్యూటర్ ఆగిపోతే అంతే ఎక్కడలేని కోపం చాలా మందికి వచ్చేస్తూ ఉంటుంది. ఇలా ప్రతీ చిన్న విషయానికి ఇటీవల కాలంలో చాలా మందికి అసహనం జీవితంలో భాగం అయిపోతుంది. దీనివలన కుటుంబ సభ్యుల మధ్య, స్నేహితుల మధ్య ఆగాదాలు పెరిగిపోతున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా మత, జాతి, ప్రాంతీయ, సాంస్కృతిక సంబంధమైన అసహనాలు ప్రపంచ యుద్ధాలకు కారణమై అనేక కోట్ల మంది ప్రాణాలు కోల్పోవడానికి, ఆస్తులు ధ్వంసం అవడానికి కారణం అయింది. మానవ చరిత్రలో రెండవ ప్రపంచ యుద్ధ ఘటనలు మాయని ముద్రలు వేశాయి. ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తాజా ఉదాహరణ. మనదేశంలో హిట్‌స్పీచ్‌లతో తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. మనదేశంలో ఎమర్జెన్సీ రోజులు నేటికీ మన కళ్లముందు కదలాడుతూ ఉండుట గమనార్హం. ప్రపంచ మానవ సహజమే అనేక మతాలు, కులాలు, జాతులు, భాషలు, రంగులు, సంస్కృతి సంప్రదాయాలు సమ్మేళనం. ఒకరినొకరు అర్థం చేసుకుని, గౌరవించుకుంటూ కొనసాగితేనే ప్రపంచంలో శాంతికపోతం ఎగిరి, సమస్త మానవాళి మనుగడ ఆహ్లాదకరంగా అభివృద్ధి చెంది, మానవజాతి మహోత్సవం వెల్లివిరుస్తుంది. లేనిఎడల మారణహోమం భగ్గుమంటూ మహాప్రదవంలా ముంచెత్తుతుంది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు, క్రుసేడ్లు, దక్షిణ ఆఫ్రికాలో జాతి వివక్షత, గోద్రా అల్లర్లు, దేశ విభజన, ప్రస్తుతం అఫ్ఘానిస్థాన్ పరిణామాలు, మయన్మార్, బంగ్లాదేశ్, సిరియాలో జరుగుతున్న మత సాంఘిక, రాజకీయ ఘర్షణలు, రువాండా, బోస్నియా అల్లర్లు, షాహీన్‌బాగ్ ఉదాతం ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, పాలస్తీనా, ఇజ్రాయెల్, ఘర్షణలు, కరోనా కాలంలో ఏర్పడిన కుటుంబ సభ్యులు మధ్య వివిధ దేశాల మధ్యఏర్పడ్డ అసహనాలు, అమెరికాలో ఇటీవల జార్జ్ ఫ్లాయిడ్‌పైదాడి, యువత ఆత్మహత్యలు ఇటువంటి అంశాలు అన్నింటికీ కారణం అసహనమే. ఫేక్‌న్యూస్, గాసిప్స్, కార్టూన్లు, మత, ప్రాంతీయ, భాషా, లింగ, కుల సంబంధించిన అంశాలు కూడా మానవుని మధ్య, ప్రపంచవ్యాప్తంగా గొడవలు, అశాంతికి కారణం అవుతూ, ప్రాణ ఆస్తి నష్టాలు కలుగుతున్నాయి. అనేక ఉన్నతమైన చదువులు చదివి, ప్రపంచ జ్ఞానం కలిగిన నేటి సమాజంలో కూడా అనేక చోట్ల వివిధ ప్రాంతాల్లో అసహనం మూలంగా ఆస్తిప్రాణ నష్టాలు జరుగుతూ ఉండటం పట్ల పౌర సమాజం దిగ్భ్రాంతి చెందుతుంది. సహనం కన్నా సముద్రం చిన్నది అన్నారు పెద్దలు. మహాత్మాగాంధీ మనదేశానికి అహింస ద్వారానే స్వాతంత్ర్యం సాధించారు. మార్టిన్‌లూథర్ కింగ్ తన మాటల ద్వారా సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రయత్నాలు చేశారు. 1964లో పౌరహక్కులు సాధించుట జరిగింది. 1945లో ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోనే సమస్యలు పరిష్కారానికి శాంతిఒర్పు అనే అంశాలకు పెద్దపీట వేసింది. 1995లో 185 దేశాలు చేసిన పారిస్ ఒప్పందం అనుసరించాలి అని కోరుతున్నారు. ప్రతీపౌరుడు, దేశం స్నేహానికి, శాంతికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. సమస్యలు చర్చల ద్వారానే పరిష్కారం చేసుకోవాలి. యువత నిజానిజాలు గ్రహించి, శాంతిగా, ఓర్పుతో నిర్ణయాలు తీసుకుని ప్రయాణించాలి. ఉద్రేకాలు పడరాదు. సామాజిక మాధ్యమాలు ఆచితూచి ప్రసారాలు చేయాలి. రేటింగ్ పెంచుకోవడంపై దృష్టి తగ్గించుకోవాలి. సెల్‌ఫోన్ వినియోగం, సీరియల్స్ ప్రభావం, డబ్బు, ర్యాంకులు, గ్రేడులు సాధన కోసం విపరీతంగా ఒత్తిడికి గురి అయి, అసహనం ప్రదర్శించుట జరు గుతుంది. మత్తులకు బానిసలు అగుట కూడా అశాంతికి కారణ మవుతుంది. సమస్యలు పెంచుకోవడం జరుగుతుంది. కుటుంబ సభ్యుల మధ్య కూడా గొడవలు, విడాకులు పర్వం కొనసాగుతోంది. ఇది సమాజానికి మంచి పరిణామం కాదు. కావున ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది. శాంతియుతంగా స్నేహపూర్వకంగా చర్చలు జరిపి, సామరస్య వాతావరణం నెలకొల్పాలి. పరిష్కార మార్గాలు కనుగొనాలి. ఒత్తిడి, స్ట్రెస్ తగ్గించుకోవాలి. యోగా, ధాన్యం ఆరోగ్య సూత్రాలు పాటించాలి. మితాహారం భుజించాలి. పరిశుభ్రమైన వాతావరణంలో జీవనం కొనసాగించాలి. జాతీయ, అంతర్జాతీయ న్యాయసూత్రాలు పాటించాలి. అహింస, సత్యం, శాంతి వంటి లక్షణాలు చిన్నారులు, యువత మెదళ్లకు ఎక్కించాలి. నైతిక విలువలు, మానవతా విలువలు నేర్పాలి. స్వీయనియంత్రణ పాటించే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. తల్లిదండ్రులు, టీచర్లు, సామాజిక మాధ్యమాలు సరైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రజల మధ్యసత్సంబంధాలు మెరుగుపరచుట ద్వారా వసుదైక కుటుంబంగా ఈ ప్రపంచం మారుతుందని ఆశిద్దాం. ●

05ATP27_05ATP27.qxd 23-11-2022 PM 10:34 Page 1



## భక్తిశ్రద్ధలతో ప్రార్థన, అగ్నిహోత్రం, భజనలు, సత్సంగం

**-అమ్మా నాన్నలేని అనాధ పిల్లలకు కొత్త వస్త్రాల పంపిణీ**
**-ఉరవకొండలో ఘనంగా సత్యసాయి 97వ జయంతోత్సవం**


సత్యసాయి చిత్రపటానికి పూజలుచేసి భజన నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 23 ప్రభాతవార్త :** సత్యసాయి బాబా 97వ జయంతోత్సవాలు బుధవారం సత్యసాయి ధ్యాన మండలి, యోగాభ్యాసకుల ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ప్రభుత్వ వి శ్రాంత ఉద్యోగుల భవనంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. సత్యసాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ప్రార్థన, అగ్నిహోత్రం, భజన కార్యక్రమాల అనంతరం మంగళహారతి, సత్సంగం, 21మంది అమ్మానాన్నలేని అనాధపిల్లలకు కొత్తబట్టల పంపిణీ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు ప్రేమ తత్వాలను చాటి సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన సత్యసాయి కలియుగ దైవంగా కొలవబడ్డారని ఆయన చూపిన సేవా మార్గం ఎందరికో స్ఫూర్తినిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భగవద్గీతా ప్రచాకర్ దివాకర్, యోగ గురువు తాటికొండ వెంకట్, ఆయుర్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు శ్రీవాణి, సత్యసాయి ధ్యాన మండలి అధ్యక్షులు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి సునీత, ప్రతినిధులు దండా జయరాములు, కేశన్న, మల్లేష్ పాల్గొన్నారు.

## నేడు సెబ్ స్టేషన్‌లో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాల వేలం

**-ఉరవకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు**

**ఉరవకొండ, నవంబర్ 23 ప్రభాతవార్త :** ఈనెల 24వ తేదీ గురువారం (నేడు) మధ్యాన్నం 2.30 గంటలకు పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌వద్ద వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాల వేలం జరుగుతుందని సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు 5,000 రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## జెడ్పీ సెంట్రల్ హైస్కూల్‌లో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

**-ఆలోచింపజేసిన విద్యార్థులు తయారు చేసిన నమూనాలు**


సైన్సు ఫెయిర్‌లో వివిధ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**ఉరవకొండ, నవంబర్ 23 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. పాఠశాలఇంచార్జ్ హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో సైన్సు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినీ విద్యార్థులు తమ చిట్టి మెదుళ్లకు పదును పెట్టి నేటి ఆధునిక సాంకేతిక పరిస్థితులకు అద్దం పట్టేలా భవిశత్తు తరాలకు ఉపయోగపడేలా రూపొందించిన వివిధ నమూనాలు అందరినీ ఆలోచింపజేశాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలం ఉపయోగపడేలా తమ ఆలోచనలకు పదును పెట్టి రూపొందించిన నమూనాల పనితీరును విద్యార్థులు ఉపాధ్యాయులు, సందర్శకులకు వివరించారు. ఉపాధ్యాయులు దావుద్, సుమిత్ర, రామక్రిష్ణ, విమల, భారతి, శ్యామల, శివప్ప, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్


చంద్రబాబుతో మాట్లాడుతున్న జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్

**గుడిబండ, నవంబర్ 23 ప్రభాతవార్త :** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడును జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ మంగళగిరి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ.. మడకశిర నియోజకవర్గం పార్టీ స్థితిగతులను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లామని ఆయన స్పందిస్తూ.. కుమ్మక్కు రాజకీయాలను సహించే ప్రసక్తే లేదని నిత్యం ప్రజల్లో ఉంటూ ధైర్యంగా ముందుకు వెళ్లి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని అలాగే వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా బిసి సెల్ అధ్యక్షులు తిప్పేస్వామి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నరేష్ (కన్నా), కెంకెర నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాకు జీతాలు చెల్లించండి మహాప్రభో..!

**- పారిశుద్ధ్య కార్మికులకు 10 నెలలుగా అందని జీతాలు**
**- కుటుంబపోషణ కష్టంగా మారిందంటూ కార్మికుల ఆవేదన**


ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

**విడపనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. కరోనా సమయంలో కూడా వీరి సేవలు ప్రజలకు అందాయి. కొన్ని ప్రాంతాల్లో పంచాయతీల పరిధిలో నిరంతరం కష్టపడే వీరి సేవలకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడంలేదు. అసలే అరకొర వేతనాలు, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. గత పది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామాల్లో పేరుకపోయిన చెత్తను వారే తరలించి, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా వుంచడానికి గత ప్రభుత్వంలో పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్స్) నియమించారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లింపునకు గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి చెల్లించవచ్చు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల సర్పంచులకు ఎవరికి తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇతర పథకాలకు వాడుకుంటుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పంచాయతీల్లో నిధులు లేక పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు కూడా చెల్లించలేకపోతున్నామని అధికారపార్టీ సర్పంచులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. గతంలో మూడు నెలలకొకసారి అయినా జీతాలు వచ్చేవని, కానీ ఇప్పుడు అవి కూడా రావడంలేదని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు రాకున్నా పారిశుద్ధ్య పనులు ఆపకుండా పనిచేస్తున్నప్పటికి కూడా అధికారులు జీతాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు పెండింగ్‌లో వున్న జీతాలు వెంటనే ఇవ్వాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దుమ్ము దూళితో నిత్యం పోరాడే తమకు జీతాలు ఇవ్వకపోతే ఎలా అంటూ వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## ఘనంగా సత్యసాయి 97వ జయంతి వేడుకలు


రోగులకు భోజనం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 23 ప్రభాతవార్త :** పట్టణంలో బుధవారం సత్యసాయి భక్తమండలి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి బాబా దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేకపూజలు, భజన కార్యక్రమాలు, లాలిపాటలు, పాతాకావిష్కరణ గావించారు. అనంతరం కమిటీ చైర్మన్ పివి రమణ పేదలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. నారాయణ సేవలో భాగంగా ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు డాక్టర్ యల్లప్ప పర్యవేక్షణలో ఆహారం ప్యాకెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో వేదమూర్తి, వీరనారాయణ, సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, కాశీరావు, ప్రసాద్, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## కూపన్లు లేకున్నా ఉచిత బియ్యం పొందవచ్చు

**అగళి, నవంబర్ 23 ప్రభాతవార్త :** గతంలో రెండు నెలలపాటు పిఎం కిసాన్ గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఒక్కో లబ్దిదారునికి 5 కెజిల బియ్యం ప్రకారం ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఉచిత బియ్యాన్ని కొన్ని కారణాల వల్ల కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల ద్వారా పంపిణీ చేయడానికి కమిషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో కొన్ని రోజులపాటు బియ్యం పంపిణీని నిలిపి వేసింది. బిజెపి నాయకులు, ప్రతిపక్షాలు, పత్రికలు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేయాలని కథనాలు ప్రచురించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదలకు ఉచిత బియ్యాన్ని అందిస్తోంది. ఉచిత బియ్యం పొందే వారు తెల్ల రేషన్ కార్డు ఉంటే పొంద వచ్చు. ప్రత్యేకంగా ఈ నెల కూపన్లను పంపిణీ చేయలేదు. ఈ విషయాన్ని పేదలు గుర్తించి బియ్యాన్ని పొందాలి.

## మసీదు స్థలంలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 23 ప్రభాతవార్త :** పట్టణంలోని జామియా మసీదు సంబంధించిన స్థలంలో కొందరు బండలు పాతి స్థలాన్ని ఆక్రమించగా బుధవారం ముతవల్లి ముల్లారషీద్ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. సర్వేనెంబర్ 490లో విలువైన భూమిలో బండలు పాతి ఆక్రమణకు యత్నించారు. సమాచారం అందుకున్న మసీదు కమిటీ సభ్యులు ముతవల్లి పర్యవేక్షణలో బండలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలోజామియామసీదుకమిటీసభ్యులు పాల్గొన్నారు.

## పెన్షన్.. టెన్షన్

**అగళి, నవంబర్ 23 ప్రభాతవార్త :** 60 ఏళ్లు పైబడిన వారు అంగ వైకల్యులు, ఒంటరి మహిళలు, వైదవ్యులు, పెన్షన్‌పొందాలంటే టెన్షన్ పడుతున్నారు. గత మూడు నెలలుగా వివిధ పంచాయితీల్లో వాలెంటీర్లు, సచివాలయాల ద్వారా పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇంత వరకు మంజూరు కాకపోవడంతో పెన్షన్ దారులు టెన్షన్ పడుతున్నారు. ఇంకో కొసమెరుపు ఏమిటంటే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు అన్ని అర్హతలు ఉన్నా పెన్షన్ మంజూరు అవడానికి ఆరు నెలల సమయం పడుతుంది. ఈ విషయం నిరక్ష రాస్యులకు అవగాహన లేని వారికి అర్థం కాదు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని రోజూ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతోపాటు ఎంపిడిఓకు డిజిటల్ కీ రావడం ఆలస్యం కావడంతో గత రెండు రోజుల క్రితం డిజిటల్ కీ రావడం పెన్షన్ దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. ఫలితంగా దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతలను బట్టి సమయాన్ని బట్టి సత్వరమే పెన్షన్ మంజూరు చేస్తే పెన్షన్ కావాలన్న వారికి టెన్షన్ తగ్గుతుంది.

## సత్యసాయి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు


భగవాన్ సత్యసాయి 97వ జయంతి కేక్‌ను కట్ చేస్తున్న ఎడిసిసి బ్యాంకు అధికారులు

**కొత్తచెరువు, నవం బర్ 23, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 97వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మండలకేంద్ర మైన కొత్తచెరువులో పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు డిఇఓ యు. మీనాక్షమ్మ ఆధ్వర్యంలో, ఎడిసిసి సహకార బ్యాంకువారు తమ శాఖ బ్యాంకు ఎదురుగా బ్యాంకు మేనేజర్ ఉమాపతి, అసిస్టెంట్ మేనేజర్ సునీత, కోమలల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అలాగే శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బాబా చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి ప్రిన్సిపాల్ చంద్రమౌళిక, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నాలుగురోడ్ల కూడలిలోను, శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు కొండమీదరాయుడు, సుమలత ట్రావెల్స్ యాజమాన్యం, మెడికల్ స్టోర్ సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో నాలుగురోడ్ల కూడలిలో, పుట్టపర్తి రహదారిలో అంజిహోటల్‌ఆధ్వర్యం ఈ అన్నదానకార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవళికి మానవ సేవే మధవ సేవ అని ఆచరించి చాటిచెప్పిన భగవాన్ సత్యసాయి బాబా జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు భక్తాదులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలతో కార్యక్రమాలు నిర్వహించారు.


సత్యసాయి చిత్రపటంతో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు

## కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రికిషన్ రెడ్డికి ఘనవీడ్కోలు

**పుట్టపర్తిరూరల్, నవంబర్ 23, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీసత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలలో పాల్గొనేందుకు శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి విచ్చేసిన కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి బుధవారం తిరుగు ప్రయాణమవగా ఆయనకు ఘన వీడ్కోలు లభించింది. శ్రీసత్యసాయి విమానాశ్రయం నుండి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేంద్ర నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకెఎస్)వైస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, ఇన్‌చార్జ డిఆర్‌ఓ భాగ్యరేఖ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఎంఆర్‌ఓకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



**కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త :** మండల ఎంఆర్‌ఓగా పనిచేస్తున్న శంకరయ్యకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిసింది.

డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య

## బాధిత గొర్రెల కాపరులను ప్రభుత్వం తరపున ఆదుకుంటాం

**-ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎంపి గోరంట్ల మాధవ్**


బాధిత గొర్రెల కాపరులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, నవంబర్ 23, ప్రభాతవార్త :** బాధిత గొర్రెల కాపరులను ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని పుట్టపర్తి శాసన సభ్యుడు దుద్దుకుంటశ్రీధర్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్‌లు హామీ ఇచ్చారు. ఈ నెల 22వ తేది మంగళవారం రోజున రైలు పట్టాలపై రైలు క్రిందపడి 120 గొర్రెలు మృతి చెంది నష్టపోయిన గొర్రెల కాపరులైన ఉంగరం నారాయణ, ఉంగరం రామాంజినేయులు, బత్యాల లక్ష్మినారాయణలను ఎంపి గోరంట్లమాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిలు బుధవారం మండల పరిధిలోని కె.లోచర్ల గ్రామంలో వారి స్వగృహాలకు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు గొర్రెల కాపారులకు తక్షణ సహాయంగా కొంత మేర ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పశువైద్యాధికారి మల్లేష్‌గౌడన, తహశీల్దార్ రామాంజినేయులు రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపిపి గంగరాజు, వైఎస్ఆర్‌సిపి నాయకులు నారాయణ స్వామి,

## పాలగిట్టుబాటు ధరల పెంపును సద్వినియోగం చేసుకోండి

**-జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్**

**పుట్టపర్తిరూరల్, నవంబర్ 23, ప్రభాతవార్త :** పాడి రైతుల ఆర్థిక అభివృద్ధిని కాంక్షిస్తూ కైరా యూనియన్ ఎపి-అమూల్ పాలడైరీ వారు ఈ నెల 24వ తేది గురువారం నుండి పాలధరలను పెంచిందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని పాడిరైతులు, పాల ఉత్పత్తిదారులు, రాష్ట్ర డైరీ అభివృద్ధి సహకార సంఘం (ఎపిడిడిసిఎఫ్) సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు కైరా యూనియన్ ఎపి-ఆమూల్ డైరీ సంస్థలు తమ బ్రాండ్ క్రింద పాలు, పాలఉత్పత్తుల ధరలను ఉత్పత్తి ఖర్చులు పెరగడం, నిర్వహణ భారం కావడంతో పెంచుతున్నట్టు ప్రకటించిందన్నారు. ప్రస్తుతం రూ.30.50 పైలుగా ఉన్న ఆవుపాలు (కనిష్టకొవ్వు 3.50%, ఎస్‌ఎన్‌ఎఫ్ 8.5%)ను రూ.32.13పైలకు పెంచడం జరిగిందని, అలాగే రూ.42.50పైలుగా ఉన్న గేదె పాలు(కనిష్టకొవ్వు 6.0%, ఎస్‌ఎన్‌ఎఫ్ 9.0%) యొక్క ధరను రూ.44.97పైలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే నాణ్యమైన పాల సేకరణను ప్రోత్సహిస్తూ కార్యకర్తలకు ఇచ్చే నిర్వాహణ చార్జీలను కూడా ఒక కేజీ ఘన పదార్థాలకుగాను 20% పెంచిందని, ఆ ప్రకారం ప్రస్తుతం రూ.7.90పైలుగా ఉన్న నిర్వహణ చార్జీ రూ.9.50పైలకు పెంచడమైందన్నారు. పశువులు ఆరోగ్యకరంగాను, పాల ఉత్పత్తిని పెంపొందించేందుకు అవసరమైన పోషక విలువలున్న పశుదాణాను పాడి రైతులకు సరఫారా చేస్తున్న కార్యకర్తలకు 50 కెజీల బస్తాకు గాను రూ.10ల చొప్పున ప్రోత్సహకాన్ని రాష్ట్రంలోని పాల అభివృద్ధి సంఘం ద్వారా ఈ నెల 22వ తేది నుండి అమూల్ సంస్థ అందివ్వడం జరుగుతుందన్నారు.

## కమ్మవారిపల్లిలో బిజెపి ఆధ్వర్యంలో బస్తీసంపర్క్ కార్యక్రమం


బస్తిసంపర్క్ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**గోరంట్ల, నవంబర్ 23 ప్రభాతవార్త :** బిజెపి ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్ పిలుపు మేరకు మస్తీ సంపర్క్ అభియాన్ 2022లో భాగంగా రాష్ట్రంలో 5 వేల ఎస్‌సి కాలనీల్లో వీధి సభలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గోరంట్ల మండలం కమ్మవారిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షులు ఎ.రామకృష్ణ, రాయలసీమ ఎస్‌సి మోర్చా ఇన్‌చార్జ్ ఆనంద్, అశోక్, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, ఒబిసి మోర్చా గోరంట్ల మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు శంకర్‌రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నజురుల్లా, ఖగేంద్ర, వెంకటాచలం, మహాదేవ్, హనుమంత్‌యాదవ్, బండారు నాగప్ప, నరేష్, అచ్చు వెంకటేష్, లక్ష్మారెడ్డి, నటరాజ్, మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఓర్వని జనసేనాని

**-జనసేన నాయకులపై ఫైర్ అయిన వైసిపి నాయకులు**



సమావేశంలో వైసిపి నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 23 ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మతి భ్రమించి రాష్ట్రంపై విమర్శలు చేయడమే కాకుండా ఆయన బాటలోనే జనసేన నాయకులు కూడా గ్రామాలపై పడి లేనిపోని రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసిపి నాయకులు బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పేరుమాళ్లపల్లి గ్రామానికి రహదారిలేదని ప్రభుత్వంపై ముఖ్యమంత్రిపై అనవసర ఆరోపణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని వాస్తవాలు తెలియకుండా అక్కడికి వెళ్లడం ప్రభుత్వంపై బురదచల్లడం సిగ్గుచేటు అని ఒక మాజీ మంత్రిగా ఎంపిగా గోరంట్ల మండల వాసిగా గత 30 ఏళ్లకుపైగా రాజకీయ చరిత్ర కలిగిన నిమ్మల కిష్టప్ప స్వగ్రామమైన పెరుమాళ్లపల్లికి గత 30 ఏళ్లలో వేయని రోడ్డును ప్రస్తుతం గత మూడేళ్లగా అధికారంలోకి చేపట్టిన వైసిపి ఆధ్వర్యంలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ రోడ్డు వేయించడానికి అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారన్నారు. వాస్తవాలు తెలియకుండా జగన్ మావయ్య అంటూ కొంత మంది విద్యార్థులతో ధర్నా చేయించి అనవసర చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ లక్ష్మినరసప్ప, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, జిల్లా సెంట్రల్‌బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, జెడ్పి కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ బాష, ఉపసర్పంచు రాజారెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, సర్పంచులు అశ్వర్థరెడ్డి, ప్రభాకర్‌రావు, నర్సి రెడ్డి, వాసుదేవనాయక్, ఎంపిపి భర్త మూర్తి, వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, కొట్లో రంగారెడ్డి, వీరనారాయణరెడ్డి, అంగడి నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మిక్చర్ కృష్ణారెడ్డి, వెంకటేష్, నాగరాజు, ఓబులకుమార్, ఎంపిటిసి సోమశేఖర్, గంగాధర్ (గంగోలి), తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుంకులమ్మ, దేవమ్మ ముత్యాల పల్లకి ఉత్సవం

**విడపనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సుంకులమ్మ, దేవమ్మ ముత్యాలమ్మ పల్లకి ఉత్సవం ఘనంగా కన్నుడపండువగా బుధవారం నిర్వహించారు. ఉదయం నుండి భక్తులకు భోజనాలు అందచేశారు. రథోత్సవం ఎంతో ఘనంగా జనసందోహం మధ్య జరిగింది. పూజారి, భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించారు.


ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

## మదాని డిఫెన్స్ (మిలటరీ) అకాడమీ విద్యార్థులకు అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 23 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయిబాబా 97వ జయంతి పురస్కరించుకుని గోరంట్ల పట్టణంలో బాబా భక్తులు సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి నగరసంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం గోరంట్ల పట్టణంలోని మదాని డిఫెన్స్ అకాడమీ (మిలటరీ) విద్యార్థులకు బుధవారం అన్నపూర్ణ మెస్ (గురుస్వామి) ఆదినారాయణ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదాని డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు ఫకృద్ధిన్‌సాబ్ ఆదినారాయణ గురుస్వామిని అభినందించారు. ఈ కార్య క్రమంలో సత్యసాయి భజన మండలి సభ్యులు మాజీ ఉపసర్పంచు సుబ్బరాయుడు, శ్రీనివాసగుప్తా, సునీతమ్మ, వెంకటేష్, రత్నమయ్య, అయ్యప్పస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ శిబిరాలు కిటకిట


ఆధార్ సెంటర్ వద్ద గుమికూడిన జనాలు

**విడవనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరానికి బుధవారం మండలంలోన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి, విద్యార్థులు పాఠశాలలో జాయినింగ్ అవ్వడానికి ఆధార్ నమోదు చేసి అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలి. గతంలో ఆధార్ నమోదు చేసుకున్న అనేక మంది అప్‌డేట్ చేసుకోక పోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆన్‌లైన్ నమోదు చేసేటప్పుడు ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో అనర్హులవుతున్నారు. పది సంవత్సరాలుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు తప్పక అప్‌డేట్ చేయించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ శిబిరాన్ని నిర్వహించారు. ఐదేళ్ల నుండి 16 ఏళ్ల లోపు చిన్నారులకు బుధవారం ఆధార్ అప్‌డేట్ చేశారు. చిన్నపిల్లలను తల్లిదండ్రులు తీసుకరావడంతో శిబిరం కిటకిటలాడింది. ఈ ఆధార్ అప్‌డేట్ శిబిరాన్ని పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాష, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు అందుబాటులో వుండి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత


బహుమతులు అందచేస్తున్న ఎస్ఐ

**విడవనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీసుంకులమ్మదేవి, శ్రీదేవమ్మదేవి ఏడవ ముత్యాలపల్లకి ఉత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కబడ్డీ పోటీల్లో విజేతలకు స్థానిక ఎస్ఐ సురేష్‌బాబు బహుమతులు అందచేశారు. బహుమానం స్వీకరించిన పాల్తూరు, హవళిగి జట్టు సభ్యులు వారు పొందిన నగదు మొత్తాన్ని దేశాయ్ సిద్ధార్థ్, మున్నా ఆర్థికసాయం కింద ఆర్గనైజింగ్ సభ్యులు రఘు, రవిజేత, సురేంద్ర, అభి, రూపనందలకు అందచేసి అందరి మనసులు గెలుపొందారు. ఇలాంటి మంచి పని చేసినందుకు గ్రామ ప్రజలందరూ వారిని అభినందిస్తున్నారు.

## అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి - సిపిఐ


వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**విడవనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త :** అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సిపిఐ సీనియర్ నాయకులు ఎంబి చెన్నరాయుడు, సిపిఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతివృష్టి కారణంగా వేరుశనగ, పత్తి, ఆముదం, జొన్న, మొక్కజొన్న, ఉద్యానపంటలు నష్టపోయాయన్నారు. పెట్టిన పెట్టుబడి అందక అప్పులు చేసి తీర్చలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పాలకులు మాత్రం రైతులకు నష్టపరిహారం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున పంటనష్టపరిహారం అందించాలన్నారు. మిరపపంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు చెల్లించాలన్నారు. అంతేకాకుండా స్ప్రింక్లర్లు, డ్రిప్పు పైపులు పరికరాలు రైతులందరికి 90 శాతం సబ్సిడీతో అందచేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి చేయలేకనే పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు

**-జనసేన పార్టీ మండల కన్వీరన్ టి.గోపాల్**


మాట్లాడుతున్న టి.గోపాల్

**విడపనకల్లు, నవంబర్ 23 ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వానికి అభివృద్ధి చేయడం చేతకాక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ఆ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ మండల కన్వీనర్ టి.గోపాల్ అన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంతర్గత రహదారులు జగనన్న కాలనీలోని మౌళిక సదుపాయాలు, గృహ నిర్మాణాలు, పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన, జాబ్ క్యాలెండర్, సిపిఎస్ రద్దు ఇలాంటి అంశాలపై వైసిపి నాయకులతో తాము చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. పవన్‌కళ్యాణ్ చిత్తశుద్ధి నిజాయితీ సిద్దాంతాలు నచ్చిన ప్రజలు జనసేన వైపు ఆకర్షితులవుతుంటే మింగుడపడని వైసిపి నేతలు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి పవన్‌కళ్యాణ్‌పై అనవసర ఆరోపణలు చేస్తే వైసిపి భాగోతాన్ని క్షేత్రస్థాయిలో ఎండగడతామని ఆయన హెచ్చరించారు.

## దేవరచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

**కదిరి టౌన్, నవంబర్ 23, ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం డిసెంబర్ 8న దేవరచెరువు వద్ద తలపెట్టిన సందర్భంగా బుధవారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి అధికారులతో కలిసి చెరువు పరిసరప్రాంతాలను పరిశీలించారు. చెరువు వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ముళ్లపొదలను తొలగించడంతో పాటు ప్రధాన రహదారి నుండి దేవరచెరువు వరకూ గ్రావెల్ రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. తెప్పోత్సవానికి అసౌకర్యాలకు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ గోపాలక్రిష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన డిటి మున్వర్



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న డిటి మున్వర్

**కదిరి, నవంబర్ 23, ప్రభాతవార్త**

కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డిని డిప్యూటి తహశీల్దార్ మున్వర్ హుసేన్ బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తూ డిటిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రేవశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లడంతో పాటు వాటిని అర్హులైన పేదలకు అందేవిదంగా కృషి చేస్తానన్నారు.

## అన్నదానం కోసం బియ్యం వితరణ

**కదిరి టౌన్, నవంబర్ 23, ప్రభాతవార్త**



బియ్యం ప్యాకెట్లను అందచేస్తున్న ఎస్సై

కదిరి శ్రీ అయ్యవ్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో 60 రోజుల పాటు జరిగే అన్నదాన కార్యక్రమానికి ముదిగుబ్బ ఎస్సై జూరి ఎటి హేమంత్‌కుమార్ బియ్యం బస్తాలను విరాళంగా అందచేయడంతో రూ 8116 నగదును సేవా సమితి సభ్యులకు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గత 6 సంవత్సరాలుగా అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా తన వంతు వితరణగా 25కేజీల పరిమాణం గల 60 మూటల బస్తాల బియ్యాన్ని ఇచ్చానన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఎస్సై హేమంత్‌ను అభినందించారు.

## మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు ,ప్రజా ప్రతినిధులు

**నల్లచెరువు, నవంబర్ 23, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మండల అధ్యక్షులు కే.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఓ శంకుతల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



సమస్యలు వెల్లడిస్తున్న సర్పంచ్ పంచరత్నమ్మ

ఈ సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ బోరులలో నీరు సమృద్ధిగా ఉందని రైతులు మల్బరీ రైతులకు సబ్సిడి ఇస్తుందని హార్టీకల్చర్ అధికారి పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా ఇల్లుకట్టుకోవాలనే వారు ప్రభుత్వం అవకాశం కల్పించిందని విఆర్ఓ నుండి పొజీషన్ సర్టిఫికెట్ పొంది నూతన గృహం కొరకు ధరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ అధికారులు తెలిపారు. ఇంటి వద్దకే డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సి వైద్యులు గ్రామాలలో పర్యటించి ఇంటింటికి తిరిగి వైద్యం చేసు_న్నారని సిహెచ్ఓ రామచంద్రారెడ్డి తెలిపారు. అదేవిధంగా వైఎస్సార్ హెల్త్ సెంటర్ అల్లుగుండు గ్రామానికి స్థలం కావాలని తెలిపారు. స్పందించిన ఎంపిపి రమణారెడ్డి 5 సెంట్లు అనుకూలిస్తామని తెలిపారు. సహకార సంఘం అధ్యక్షుల జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సహాకర సంఘం ద్వారా ఐకెపి మహిళా సంఘాలకు ప్రతి తక్కువ వడ్డీ రుణాలు సహాకర సంఘం బ్యాంక్ ద్వారా పొందవచ్చని, సంఘాలు మోటివేట్ చేయాలని ఎటిఎం రమణమ్మకు సూచించారు. మేజర్ పంఛాయతీ సర్పంచ్ పంఛరత్నమ్మ గ్రామ సమస్యలను వెల్లడించారు. జాతీయ రహదారిపై పక్కన కల్వర్టు పనులు తమసొంత నిధులతో రెండు సార్లు మరమ్మత్తులు చేశామని, అధికమైన లోడ్ వాహనాలు పోతుండటంతో కుప్పకూలో ఉన్నాయని, ఆర్ అండ్ బి వాల్లు సహకరించి బ్రిడ్జిలు ఏర్పాలు చేయాలని తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఎస్సి కాలనీవాసులు ఎన్నో సంవత్సరాల నుండి విధ్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడటంతో ఇంతకు మునుపు సర్వసభ్య సమావేశంలో విధ్యుత్ అధికారులకు మొరపెట్టుకోగా ఎమ్మెల్యే సహాకరంతో ఏఈ వాగ్దేవి కాలనీకి విధ్యుత్ మరమ్మత్తులు త్వరితగతిన పూర్తిచేసి వారికి విధ్యుత్ సమస్యలు తీర్చారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి స్పందించి ఏఈ వాగ్దేవికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నారాయణస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు ఈఓఆర్‌డి దివాకర్, ఎంపిటిసిలు,సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యరంగాల విద్యార్థులకు బంగారు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి జగన్

### - గడపగడపకు మనప్రభుత్వంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**కదిరి, నవంబర్ 23, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాల విద్యార్థులకు అధి క ప్రాధాన్యత కల్పిస్తూ బంగారు బాటలు వేస్తున్నాడని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నాడు. ఇందులో భాగంగా కదిరి మండలం కాళసముద్రం సచివాలయంలో బుధవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమె ్మల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి గడపను సందర్శించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అములు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో విద్య, వైద్యం సంక్షేమానికి అధిక ప్రాధాన ్యతను ఇస్తూ నాడు-నేడు కార్యక్రమం కింద అత్యాధునికమైన అన్ని వసతులతో కూడిన భవన సముదాయాలను, విద్యను అందిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట అమర్నాథ్‌రెడ్డి, ఎంపిడిఓ సుధామణి, మార్కెట్ యార్డ్ చైర్మెన్ ఇంద్రారెడ్డి, జడ్పిటిసి రాధాబాయి, వైస్ ఎంపిపి ఆనంద్‌నాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ లలితమ్మ, అగ్రి బోర్డు మెంబర్ సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరి కాదు

**కదిరి, నవంబర్ 23, ప్రభాతవార్త**



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై ప్రతిపక్షపార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సముచితం కాదని వైఎస్సార్ సిపి నాయకులు ఎస్‌కే వలి, పిచ్చిలి శంకర, అల్తాఫ్, ఇబ్రహీం, కుర్లి శివారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుమ్మరవాండ్లపల్లిలో నిరుపేదల ఇళ్లను కూల్చివేసిన సంఘటనను తాము త్రీవంగా ఖండిస్తున్నామన్నారు. తమ పార్టీ నేతగా చెప్పుకుంటున్న ఒ నాయకుడి వ్యక్తిగత వ్యవహారం అని ఇందులో తాము కాని తమ ఎమ్మెల్యేకాని ఎలాంటి మద్దతు ఇవ్వలేదన్నారు. ప్రతి పక్షపార్టీనాయకులు ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణను ఒర్వలేక బురజల్లే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా కదిరి ఎమ్మెల్యేగా సిద్ధారెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకూ ప్రభుత్వ స్థలాలు, మైనార్టీ ఆస్థులకు రక్షణ దొరికందిన్న సంగతి అందరూ ఒకసారి గుర్తెరిగి గమనించాలన్నారు. మరొకసారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం అయితే వారికి తగిన గుణపాఠం చెబుతామని ఎస్‌కే వలి హెచ్చరించారు.

## హుండీలో సొమ్మును కాజేసిన దుండగులు

### - డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో తనిఖీలు నిర్వహించిన పోలీసు అధికారులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 23, ప్రభాతవార్త**



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

మండల పరిధిలోని సోమావతినది ఏటిగడ్డపై వెలసిని మల్లూరమ్మతల్లి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎవరో గుర్తుతెలియని దుండగులు హుండీని పగులగొట్టి సొమ్ము, ఇతర అభరణాలను దోచుకువెళ్లినట్లు గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఏఎస్సై కిశోర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మల్లూరమ్మ ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చోరీ చేసిన మాట వాస్తవమేనన్నారు. అయితే ఎంత మేరకు నగదు, నగలను దోచుకువెళ్లారో తమ విచారణలో వెల్లడవుతుందన్నారు. అంచనా మేరకు రూ 50వేలు పైచిలుకు నగదు చోరీ జరిగి ఉంటుందన్నారు. తమకు అందిన సమాచారంతో హుటా హుటిన మల్లూరమ్మతల్లి ఆలయానికి వచ్చి దుండగులు పగులగొట్టిన హుండీ వద్ద ఉన్న ఫింగర్‌ప్రింట్స్‌ను క్లూస్‌టీం ద్వారా సేకరించామన్నారు. అలాగే చోరి జరిగిన చుట్టుపక్క ప్రాంతాలను డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీ నిర్వహించామన్నారు. నారప్పగారిపల్లి గ్రామ పెద్ద రెడ్డిపల్లి రాజారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## వైభవంగా శ్రీఅయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో శ్రీఅయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అయ్యప్పభక్తులు శ్రీఅయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో వుంచి భక్తిపాటలు పాడుతూ ఆడుతూ మేళతాళాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతేకాకుండా సాయిబాబా జయంతి సందర్భంగా చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కడియాల జయరాంరెడ్డి, టెంకాయల శీనా, గాంధీ, కేశవ, వెంకటనాయుడు, అయ్యప్పస్వామి భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

**యాడికి, నవంబర్ 23 ప్రభాతవార్త**

కార్తీకమాసం పురస్కరించుకుని మండల కేంద్రంలోని భక్తులు జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్నారు. స్థానిక మార్కెట్‌వీధిలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయం ఆవరణలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతులను వెలిగించి అమ్మవారి భక్తి పాటలతో లయబద్దంగా నృత్యం చేశారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం అమావాస్య అనంతరం నిర్వహించే ఈ కార్యక్రమం ముందే నిర్వహించినట్లు భక్తులు తెలిపారు. ఇలా జ్యోతులతో నృత్యం చేస్తే అమ్మవారు గ్రామాన్ని కాపాడుతూ భక్తుల కుటుంబాలను సుఖసంతోషాలతో గడిపేలా చేస్తుందని భక్తుల నమ్మకం. ఈ కార్య క్రమంలో పెద్దఎత్తున చౌడేశ్వరి అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## తుమ్మలకొండ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రికి వినతి



మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**అమడగూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని తుమ్మలకొండ పురాతన ఆలయం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కమిటీ సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలకు హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అమడగూరు మండల ఆలయ సేవాభారతి కమిటీ సభ్యులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం ఆవరణం రిజర్వు ఫారెస్ట్‌లో వున్నందున కొన్ని మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రయత్నించినప్పుడు ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. కొండ ప్రాంతంలో వున్న ఆలయాన్ని రిజర్వు ఫారెస్ట్ నుండి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయానికి కొంత మంది దాతలు ముందుకు వచ్చి భక్తులకు కాలినడక సదుపాయం కల్పించారని ఆలయానికి ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ నుండి అనేక మంది భక్తులు వస్తుంటారని భక్తులకు మౌళిక సదుపాయాలైన మంచినీరు, రహదారిని కల్పించినట్లు అయితే ఈ ప్రాంతం మరొక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వారు మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమగట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉత్తమరెడ్డి, ఆలయ కమిటీచైర్మన్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అనిల్, లక్ష్మణ్, కొట్టు అశ్వత్‌కుమార్, అడ్వకేట్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### -జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**పెద్దవడుగూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

మండలంలో పత్తిపంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాని కోరుతూ సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట సాగుకు రైతుకు ఎకరాకు 50 వేల రూపాయల వరకు ఖర్చు అయిందన్నారు. నకిలీ విత్తనాల వల్ల పత్తికి పురుగుపట్టి కొంత మంది రైతులు ఎకరాకు రెండు మూడు క్వింటాళ్ళు, మరికొంత మంది రైతులు ఎకరాకు క్వింటాలు ఒక బుగ్గ పత్తి కూడా కోయకుండా పంట ఎత్తివేయడం జరిగిందన్నారు. పత్తి పంట సాగుచేసిన రైతులకు ఎకరాకు 40 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలన్నారు. గతంలో ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ రాని రైతులకు వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నారాయణ, లింగన్న, శ్రీనివాసులు, రంగనాయకులు, సుధాకర్‌గౌడ్, ముత్యాలరెడ్డి, మండల సహాయ కార్యదర్శి రంగస్వామి, అల్లాబకాష్, మల్లికార్జున, కండ్ల గూడూరు షెక్షావలి, విరుపాపురం ఆది, ఆదినారాయణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోండి

**పెద్దపప్పూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**



డిటికి వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

అతివృష్టితో ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపి రైతుసంఘం, పెద్దపప్పూరు సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం ఆధ్వర్యంలో డిప్యూటి తహశీల్దార్ మహబూబ్ బాషకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలతో వేరుశనగ, పత్తి, ఆముదము, జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, ధాన్యపంటలు దెబ్బతిని పెట్టిన పెట్టుబడి రాక ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుని సాగుచేస్తే తీవ్ర నష్టాలతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కానీ పాలకులు మాత్రం రైతులకు నష్టపరిహారం, సంక్షేమ ఫలాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున పంటనష్టపరిహారం అందించాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయలకు ఎకరాకు 50 వేల రూపాయలు చెల్లించాలన్నారు. అంతేకాకుండా స్ప్రింక్లర్లు, డ్రిప్పు పైపులు పరికరాలు ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఉచితంగా అందించాలన్నారు. బిందు, తుంపెర పరికరాలు రైతులందరికి 90 శాతం సబ్సిడీతో అందచేయాలన్నారు. భూమిలేనివారికి 8వ విడతలో ఒక్కొక్కరికి 3 ఎకరాలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి భోగాతి రామేశ్వర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు కొదమల రాజు, రాముడు, రామకృష్ణ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫెయిర్




నమూనాలను చూపుతున్న విద్యార్థులు

**యల్లనూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు బుధవారం మండలంలోని వెన్నపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో గణిత ప్రక్రియలు, వాతావరణం మార్పులు, పర్యావరణ సమస్యలు, ఆరోగ్యము, పరిశుభ్రత, కంప్యూటర్ మొదలైన అంశాలపై మూడవ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు అనేక ప్రాజెక్టులను (వర్కింగ్ మోడల్స్) తయారు చేసి సందర్శనకు వుంచారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను స్థానిక జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి సందర్శించి విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. ఈ సెన్స్ ఫెయిర్‌ను గ్రామస్తులు మరియు తల్లిదండ్రులు, అధికారులు, బ్యాంకు ఉద్యోగులు, ఉత్సాహంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇందులో ఐదు ప్రయోగాలను మండల స్థాయికి ఎంపిక చేసినట్లు ప్రకటించారు. విద్యార్థినీ, విద్యార్థులను అభినందిస్తూ ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.

## విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఓ నాగరాజు

**తాడిపత్రిరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త**

విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంఇఓ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని పెద్దపొలమడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంఇఓ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో వున్న అంతర్గత సామర్థ్యాలు, నైపుణ్యాలు బహిర్గతమవుతాయన్నారు. ఇందులో భాగంగా 5 మంది విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, బి.శ్రీరామ మూర్తి, షాషావలి, అరుణకుమారి, పుల్లారెడ్డి, క్లైమెట్‌బాబు, సుబ్రమణ్యం, రమణయ్య, నారాయణ, శ్యామల, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన టిడిపి కౌన్సిలర్

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 23 ప్రభాతవార్త**



నారా లోకేష్‌తో మల్లికార్జున

తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అనంతపురం జిల్లా ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శి, తాడిపత్రి మున్సిపల్ 30వ వార్డు టిడిపి కౌన్సిలర్ మల్లికార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. తాడిపత్రి నియోజకవర్గంలో పోలీసు ఉన్నతాధికారి అయిన డిఎస్‌పి పక్షపాత దోరణి, అధికారపార్టీ నాయకుల దౌర్జన్యాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో టిడిపి వారు ఎవరూ భయపడడంలేదని డిఎస్‌పిపై ప్రైవేటు కేసు కూడా వేశామని వైసిపి వారి దౌర్జన్యాలకు ఎప్పటికప్పుడు అడ్డుపడుతూ న్యాయపరంగా పోరాటం చేస్తూ వస్తున్నామని ఈ సందర్భంగా నారా లోకేష్‌కు తెలియచేయడం జరిగిందన్నారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తాడిపత్రి నియోజకవర్గంలో జె.సి సోదరులు వైసిపి వాళ్లకు ధీటుగా నిలబడి చాలా బాగా పోరాడుతున్నారని కొనియాడడం జరిగిందన్నారు.

## కాలరుద్రునిగా దర్శనమిచ్చిన శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 23 ప్రభాతవార్త**



కాలరుద్రునిగా అలంకరించిన దృశ్యం

పట్టణంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి బుధవారం కాలరు ద్రునిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీకమాసం చివరిరోజు పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మ, చక్రిస్వాములు అభిషేకాలు నిర్వహించి స్వామివారిని కాలరు ద్రునిగా అలంకరించారు. శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

## పండ్లమొక్కలను పరిశీలించిన అధికారులు



దానిమ్మ పంటను పరిశీలిస్తున్న అధికారులు

**పుట్లూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

ఉపాధి హామి పథకంలో భాగంగా రైతులు సాగుచేస్తున్న పండ్ల మొక్కలను బుధవారం ఎంపిడిఓ యోగానందరెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని కందికాపుల గ్రామ పంచాయతీలో సాగులో వున్న పండ్ల మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఎపిఓ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 25న సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు

**యల్లనూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**



రామచంద్రారెడ్డి

మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకం బహిరంగ ప్రజావేదిక సదస్సును ఈనెల 25వతేదీ శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 పంచాయతీల్లో 15,16వ సామాజిక తనిఖీ బృందంగా 2020 ఏప్రిల్ 1 నుండి, 2022 మార్చి 31వతేదీ వరకు చేసిన ఉపాధి పనులకు సంబంధించి చేసిన పనులకు వేతన చెల్లింపులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం చేసిన వాటికి బహిరంగంగా చర్చావేదిక నిర్వహిస్తున్నామని ఆయన తెలియచేశారు.

## నిత్యావసరసరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి




తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

**పుట్లూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

ప్రభుత్వ రేషన్‌షాపుల ద్వారా పేద ప్రజలకు నిత్యావసరసరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ ఏపి వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి ఆధ్వర్యంలో తహశీల్దార్ సుమతికి బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు అందించే నిత్యావసరసరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌షాపుల ద్వారా పేద ప్రజలకు అందించే నిత్యావసరసరుకులు పంపిణీ చేయకుండా కేవలం రేషన్ బియ్యం మాత్రమే ఇస్తున్నారన్నారు. అది కూడా ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టి పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అన్ని రకాల నిత్యావసరసరుకులు అందచేయాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పెద్దయ్య, కార్యదర్శ భాస్కర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు నాగభూషణం, బాలసుబ్బరాయుడు, వెంకటరమణ, వెంకటనారాయణ, బాలగురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

24-11Pg10:Layout 1 24/11/22 10:31 PM Page 1



ఆట




# టి20లకు కెప్టెన్‌గా హార్ధిక్ పాండ్యా

**న్యూఢిల్లీ:** టీ20ల్లో టీమిండియాకు కొత్తకెప్టెన్ రాక ఖాయం అయింది. త్వరలోనే హార్ధిక్ పాండ్యను కెప్టెన్‌గా అధికారికంగా ప్రకటించనున్నారు. బిసిసిఐ పెద్దలు రోహిత్‌శర్మకు ఈ సమాచారం కూడా చేరవేసినట్లు తెలుస్తోంది. బోర్డులో సీనియర్ సభ్యుడు ఒకరు హార్ధిక్‌కు టి20 పగ్గాలు అప్పగించే విషయమై అధికారికంగా రోహిత్‌తోమాట్లాడారని బిసిసిఐ వర్గాలు చెపుతున్నాయి. పొట్టిఫార్మాట్‌లో పాండ్యకు కెప్టెన్సీ కట్టబెట్టే ఆలోచనపట్ల రోహిత్‌కు ఎలాంటి అభ్యంతరాలు లేవని కూడా బిసిసిఐ అధికారి చెప్పినట్లు స్పోర్ట్స్ పత్రిక కథనం ఒకటి వెలుగులోకి వచ్చింది. వన్డేలు, టెస్టుల్లో కెప్టెన్‌గా రోహిత్‌కొనసాగుతాడని బిసిసిఐ వర్గాలు వెల్లడించినట్లు ఆపత్రికి వెల్లడించింది. నూటన ఎంపిక కమిటీ నియామకం తర్వాత హార్ధిక్‌కు టి20 కెప్టెన్సీ అప్పగిస్తున్నట్లు అధికారికంగాప్రకటిస్తారని బిసిసిఐ వర్గాలేతెలిపాయి. శ్రీలంక సిరీస్‌కు ముందే ఈప్రకటన ఉంటుందని సమాచారం. 2023 వన్డే వరల్డ్‌కప్‌వరకూ రోహిత్‌శర్మ వన్డే కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఈ వరల్డ్‌కప్ సైకిల్‌ముగిసేంతవరకూ టెస్టుల్లోకూడా రోహిత్ టీమిండియాకు సారథ్యం వహిస్తాడు. జట్టుకోసం ఇంకా చాలాచేయగల సత్తా రోహిత్‌శర్మకు ఉన్నప్పటికీ ఆతడిపై భారం పెరుగుతుంది.

వయసును దృష్టిలోఉంచుకుని ఈనిర్ణయం తీసుకున్నారని బిసిసిఐ అంతర్గత సమాచారం. 2024 టి20 ప్రపంచకప్‌కోసం ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని సంస్థ భావిస్తోంది. కెప్టెన్సీ రోల్‌కు హార్ధిక్ సరైన ఎంపిక అని బోర్డు భావిస్తోంది. కొత్త సెలక్షన్ కమిటీ ఎన్నికయ్యాక నియామకం ప్రకటిస్తుందని అంచనా. టి20 ప్రపంచప్‌లో భారత్ ఫైనల్‌కు చేరలేకపోవడాన్ని బిసిసిఐ సీరియస్‌గా తీసుకుంది. కప్ గెలిచే జట్టును ప్రక్షాళన చేయాలిందేనని భావనతో ఉంది. ముందుగా సెలక్షన్ కమిటీపై వేటువేసింది. మూడుఫార్మాట్లకు ఒకే కెప్టెన్ అనే నిర్ణయానికి కట్టుబడిన బిసిసిఐ ఫార్మాట్ల వారీగా కెప్టెన్లను నియమించేందుకు సిద్ధం అయింది. కెప్టెన్లపై భారం తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. హార్ధిక్ పాండ్యను టి20ల్లో కెప్టెన్‌గాప్రకటిస్తే టీమిండియా చరిత్రలో ఇద్దరుకెప్టెన్లు అధికారికంగా ఉండటం ఇదే తొలిసారి అవుతుంది. టి20లకు ప్రత్యేక కెప్టెన్‌ను నియమించడంతోపాటు ధోనీకి డైరెక్టర్‌పదవిని అప్పగించి ఆఫార్మాట్‌పూర్తిబాధ్యతలను అప్పగిస్తారని ప్రచారం.

## బంగ్లా టెస్ట్‌సిరీస్‌కు సూర్యకుమార్!

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ వన్డేసిరీస్‌ముగిసాక టీమిండియా బంగ్లాదేశ్‌పర్యటనకు వెళుతోంది. బంగ్లాతోమూడు వన్డేలు, రెండు టెస్టులకు ప్లాన్‌చేసింది. వచ్చేనెల నాలుగు, ఏడు, పదితేదీల్లో 3వన్డేలుజరుగుతాయి. డిసెంబరు14న తొలి




టెస్టు, 22వ తేదీ రెండోటెస్టుజరుగుతుంది. ఆల్‌రౌండర్ రవీంద్రజడేజాను బంగ్లా టెస్ట్‌సిరీస్‌కు ఎంపికచేసారు. అయితే ఆనాటిక ఇజడేజాపూర్తిఫిట్‌నెస్ సాధిస్తాడా అన్న డౌట్ లేకపోలేదు. ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఎడమచేతివాటం స్పిన్నర్ అక్షర్‌ఫటేల్; లెఫ్ట్‌ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్ కల్దీప్‌యాదవ్‌లరూపంలో భారత్‌ముందు మూడు స్పిన్ ఆప్షన్లు ఉన్నాయి.నాలుగో స్పిన్నర్ కావాలనుకుంటే సౌరభ్ కుమార్‌ను ఆడించేఛాన్స్ ఉంది. ఇపుడు టి20ల్లో మంచి ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్‌ను బంగ్లా టెస్టుసిరీస్‌కు ఆడించేందుకు బిసిసిఐ నిర్ణయించింది. సూర్యకుమార్ కూడా టెస్టు క్రికెట్‌కోరికను వెల్లడించాడు. సూర్యకుమార్‌కు టెస్టుజట్టులో స్థానం వస్తేటెస్టుక్రికెట్‌ను కూడా సూర్యకుమార్ తనకు అనుగుణంగా మలుచుకుని రాణిస్తాడని క్రికెట్ ఫాన్స్ చెపుతున్నారు.




## నోటికి చేతులు అడ్డుపెట్టి జర్మనీ ప్లేయర్ల నిరసన

**దోహా:** ఫిఫా వరల్డ్‌కప్‌పోటీల్లో జర్మనీ జట్టుసభ్యులు అనుసరించిన తీరు ఇపుడు ఆసక్తిగా మారింది. జట్టుప్లేయర్లు మొత్తం తమ చేతులతో నోళ్లుమూసుకుని ఫోటోలకు ఫోజులిచ్చారు. ఫిఫా విధించిన నిబంధనలు, ఆతిథ్యదేశం ప్రవేశపెట్టిన నిబంధనలకు నిరసన తెలుపుతూ ఈచర్యలకు దిగారు.

బుధవారం నాటి గేమ్‌కు ముందే 11 మంది ప్లేయర్లు తమ నోటిని చేతులతో మూసుకుని ఫోజులిచ్చారు. జర్మనీ జపాన్‌తో తలపడాల్సి ఉంది. చేతి బాండ్లను వినియోగించడానికి వీలులేదని ఖతార్ ఆంక్షలు విధించడంపై నిరసన తెలిపారు. వన్‌లవ్ ఆర్మ్ బాండ్స్ ధరించినపక్షంలో వారిపై జరిమానా విధిస్తామని ఫిఫా ఆతిథ్యదేశం ఏడు యూరోపియన్ దేశాలను హెచ్చరించింది. ఈచేతి బాండ్లు సమ్మిళితశక్తి, భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని ఏడుజట్ల కెప్టెన్లు వాదిస్తున్నారు. అయితే వారు మాత్రం చేతిబాండ్లను ధరిస్తామని స్పష్టంచేస్తున్నారు.

ఖతార్‌లో మానవహక్కుల రికార్డు, చట్టాలు, స్వలింగసంపర్కులపట్ల నేరపూరిత చర్యలు చేపట్టడంపై ఇపుడు సర్వత్రా చర్చజరుగుతోంది. బుధవారం మ్యాచ్‌కు ప్రారంభం ముందే సాకర్ బాడీ ఫిఫా కెప్టెన్ చేతిబాండ్‌ను ధరించి ఉండటాన్ని హెచ్చరించింది. జర్మనీకోచ్ హాన్సీ ఫ్లిక్, సాకర్ సమాఖ్య అధ్యక్షుడు బెర్న్ న్యూడ్రాఫ్‌లు ఫిఫా నిర్ణయంపై తీవ్రనిరసన వ్యక్తంచేసారు.



## స్టేడియంలో చెత్తను ఏరిపారేసిన జపాన్‌ఫాన్స్

### ఫిఫా ఆతిథ్యదేశంలో జపనీయులకు ప్రశంసలు

**దోహా:** ఖతార్ వేదికగాజరుగుతున్న ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో జపాన్ ఫ్యాన్స్ తమ పనితో అందరినీ ఆకర్షించారు. చెత్తగాళ్ల చెంప చెళ్లుమనిపించారు. పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే జపానీయులు ఫిఫా ప్రపంచకప్‌లోభాగంగా ఖతార్ ఈక్వెడార్ మ్యాచ్‌జరిగినతర్వాత చిందరవందరగా చెత్తతో నిండిన స్టేడియం చూసి తట్టుకోలేకపోయారు.

తమపనికాకపోయినా చెత్తను ఏరిశుభ్రంచేసారు. ఫిఫాప్రారంభం అయిన 20వతేదీ వేడుకలు ముగిసాక ఖతార్ ఈక్వెడార్‌మ్యాచ్‌జరిగింది. ఫ్యాన్స్ రచ్చరచ్చచేసారు. తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ వాటర్‌బాటిళ్లు చెత్తడబ్బాల్లో వేయకుండా అక్కడేపడేసారు. దాంతో జపాన్‌కు చెందిన ఫుట్‌బాల్‌ఫ్యాన్స్ కొంతమంది స్టేడియంలో కలియతిరుగుతూ ఇతర దేశాల ఫ్యాన్స్ పడేసిన చెత్త నంతా సంచుల్లోకి ఎత్తుతూ కనిపించారు. ఖతార్‌లోని యూట్యూబర్ ఈ దృశ్యాలను తన సోషల్‌మీడియాలో పంచాడు. తమ దేశం కాకపోయినా చూడటానికి వచ్చినసజపనీయులు తమచుట్టూపరిసరాలను శుభ్రంచేయడంపట్ల ఖతార్‌వాసులు కూడా వేనోళ్లప్రశంసించారు. జపాన్‌లో చాక్లెట్‌తిన్నా పేపరు జేబులో పెట్టుకుని చెత్తడబ్బా కనిపిస్తే అందులో వేస్తారు. అదే మనదేశంలో ఏంచేస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

## మార్టిన్ గప్తిల్‌ను రిలీజ్‌చేసిన కివీస్ క్రికెట్ బోర్డు!




**వెల్లింగ్టన్:** కివీస్ సీనియర్ ఆటగాడు మార్టిన్ గప్తిల్‌ను న్యూజిలాండ్‌క్రికెట్‌బోర్డు సెంట్రల్ కాంట్రాక్టునుంచి విడుదలచేసింది. 36ఏళ్ల గప్తిలక్ష్ తనను కాంట్రాక్టునుంచి తప్పించాలని గతంలోనే కోరడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు బోర్డుప్రకటించింది. సెంట్రల్ కాంట్రాక్టు నుంచి తప్పుకోవడంతో గప్తిల్ ఇకపై ఐపిఎల్ వంటి టోర్నీల్లో ప్రపంచంలో ఎక్కడైనా ఆడేందుకు వీలు కలుగుతోంది. గప్తిల్ అభ్యర్ధనను సమ్మతించడంతోపాటు వెంటనే విడుదలచేసామని న్యూజిలాండ్‌క్రికెట్‌బోర్డు ప్రకటించింది. కివీస్ తరపున టి20ల్లో ఎక్కువ పరుగులుచేసిన ఆటగాడిగా గుర్తింపు పొందిన గప్తిల్ వన్డేల్లో కివీస్‌తరపున మూడో గరిష్ట స్కోరరుగా నిలిచాడు. ఇటీవల ముగిసిన టి20 ప్రపంచకప్‌జట్టులో గప్తిల్‌సభ్యుడిగా ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లోకూడా ఆతడికి ఆడే అవకాశం లభించలేదు. గప్తిల్ బదులు టాప్ ఆర్డర్‌లో ఫిన్ అలెన్‌ను ఆడించేందుకు మేనేజ్‌మెంట్ ఆసక్తిచూపించింది. ప్రస్తుతం భారత్‌తోజరుగుతున్న సిరీస్‌కు గప్తిల్‌ను కివీస్‌బోర్డు ఎంపికచేయలేదు. కివీస్‌బోర్డును కాంట్రాక్టునుంచి విడుదలచేయాలనికోరడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. ట్రెంట్ బౌల్ట్, కాలిన్ డి గ్రాండ్‌హోం సైతం ఇదే విధంగా కోరారు. కాంట్రాక్టునుంచి విడుదలయినా తాను టి20లనుంచి రిటైర్‌కావడంలేదని, అందుబాటులో ఉంటే ఎంపికకకు పరిగణనలోనికి తసీఉకోవాలని కోరుతున్నట్లు గప్తిల్ తెలిపాడు. గప్తిల్‌స్థానంలో ఎవరిని తీసుకునేది తర్వాతప్రకటిస్తామని న్యూజిలాండ్ బోర్డుప్రకటించింది. మార్టిన్ మాకు అద్భుతబ్యాట్స్‌మాన్ అని వేరే అవకాశాలు అన్వేషించాలనుకుంటున్నపుడు అడ్డుకోవాలని భావించడంలేదని, కివీస్‌క్రికెట్‌చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ వైట్ అన్నాడు. గప్తిల్‌నిర్ణయాన్ని గౌరవిస్తామని తెలిపాడు.

## మాంఛెస్టర్ యునైటెడ్‌కు రొనాల్డో గుడ్‌బై




**దోహా:** క్రిస్టియానో రోనాల్డో ఇపుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మాంచెస్టర్ యునైటెడ్‌నుంచి తక్షణమే వైదొలిగాడు. ఇపుడు తదుపరి చర్యలేమిటన్న అంశంపైపే సాకర్ ఫాన్స్‌లో ఉత్కంఠగా ఉంది. పోర్చుగల్ స్టార్ తన కాంట్రాక్టును మాంచెస్టర్‌తో ముగిసినట్లు వెల్లడించారు. 37 ఏళ్ల రోనాల్డో ఇప్పటికీ తన సమర్ధతను శక్తిసామర్థ్యాలను నిరూపించుకోగలనని చెపుతున్నాడు. రోనాల్డోకు మాంచెస్టర్ క్లబ్‌నుంచి వారానికి 5.94 లక్షల డాలర్లు ఫీజురూపంలో అందేది. ఇపుడు చాంపియన్స్ లీగ్ క్లబ్‌కు సంతకంచేసేందుకు రొనాల్డో ఆసక్తితోఉన్నట్లు తెలుస్తోంది.యునైటెడ్ క్లబ్‌మేనేజర్ ఎరిక్ టెన్ హాగ్,క్లబ్ యాజమాన్యంపై ఇటీవలే రొనాల్డో విమర్శలు చేసాడు. ఇంచుమించు 50 లక్షలమంది ఇన్‌స్టా ఫాలోవర్లు ఉన్న రొనాల్డో ఎక్కువగా ఇతర ఆఫర్లు వస్తున్నా చాంపియన్స్ లీగ్ క్లబ్‌తరపునే ఆడేందుకు ఆసక్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

# వాణిజ్యం


## హెచ్‌పిలోనూ ఉద్యోగుల కోత




**న్యూఢిల్లీ, నవంబరు 23:** ప్రస్తుతం ఉన్న వ్యాపార వాతావరణంలో ఎదురవుతున్న సవాళ్లకు ఉద్యోగుల తొలగింపే ఏకైక సమాధానం అన్నట్లుగా కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. ఈ క్రమంలో ఒకటి తర్వాత మరొక కంపెనీ తన ఉద్యోగుల తొలగింపు ప్రణాళికలను ప్రారంభించాయి. తాజాగా ఇందులో కంప్యూటర్ల తయారీ కంపెనీ హెచ్‌పి కూడా చేరిపోయింది. హెచ్‌పి ఇది చిన్నప్పటి నుంచి మనలో చాలా మందికి పరిచయం ఉన్న కంప్యూటర్ల తయారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన దీని వ్యాపారాన్ని కూడా ప్రస్తుత మాంద్యం అతలాకుతలం చేస్తోంది. దీంతో ఫేస్‌బుక్, అమెజాన్, ట్విట్టర్ వంటి దిగ్గజాల తర్వాత హ్యూలెట్ ప్యాకర్డ్ ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. తన ప్లాన్‌లో భాగంగా కంపెనీ సుమారు 6వేల మందిని తొలగించేందుకు సిద్ధంగా ఉంది. మాంద్యం ఆవరించిన వేళ చాలా మంది ప్రజలు కొత్త వస్తువులను కొనేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో పర్సనల్ కంప్యూటర్లకు భారీగా డిమాండ్ తగ్గింది. ఇది కంపెనీ ఆదాయం, లాభదాయకతలపై పెద్ద ప్రభావాన్నిచూపింది. రానున్న మూడేళ్లలో మొత్తంగా 10శాతం ఉద్యోగులను తొలగించాలని హెచ్‌పి యాజమాన్యం నిర్ణయంతీసుకుంది. గతంలో అమెరికాకు చెందిన చిప్ మేకర్ ఇంటెల్ కూడా ఇదే కారణంతో ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 61 వేల మందిలో 10 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్లు కంపెనీ సిఇఒ ఎన్రిక్ లోర్స్ వెల్లడించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ఖర్చులు మొత్తం ఒక బిలియన్ డాలర్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. ఆ ఖర్చుల్లో దాదాపు 60శాతం కొత్త ఆర్థిక సంవత్సరంలో 2023లో తగ్గుతాయని వెల్లడించారు. ఈ ప్రణాళిక 2025 ఆర్థిక సంవత్సరం చివరినాటికి యేడాదికి 1.4బిలియన్ డాలర్లకు ఆదా చేస్తుందని స్పష్టం చేశారు.ప్రస్తుతంమూడవత్రైమాసికంలోప్రపంచ పిసి షిప్‌మెంట్‌లలో దాదాపు 20శాతం క్షీణత నమోదైందన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబరు 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. దీంతో వరుసగా రెండోరోజూ లాభాలు నమోదు చేసినట్లయింది. అయితే చివరి అరగంటలో అమ్మకాలు జోరందుకున్నాయి. దీంతో సూచీలు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. త్వరలో ఫెడ్ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే దేశీయంగా ఎలాంటి ప్రతికూల సంకేతాలు లేకపోవడంతో ఎట్టకేలకు సూచీలు లాభాలను నిలబెట్టుకోగలిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో చివరికి సెన్సెక్స్ 91.62 పాయింట్లు పెరిగి 61,510.58 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 23.05 పాయింట్లు పెరిగి 18,267.25 పాయింట్ల వద్ద




నిలిచింది. ఎస్‌బిఐ, బజాజ్ ఫైనాన్స్, డాక్టర్ రెడ్డీస్, కోటక్ మహీంద్రా బ్యాంకు, సన్‌ఫార్మా, మారుతి సుజుకి, ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్‌అండ్‌టి, నెస్లే ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్, టిసిఎస్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. కెపిఐటి షేరు బుధవారం 6.38 శాతం పెరిగి రూ.727 వద్ద ముగిసింది. డెలివరీ స్టాక్స్ వరుసగా ఆరో రోజూ నష్టాల్లోనే కొనసాగాయి. ఇంట్రాడేలో 5.3శాతం క్షీణించి రూ.317 వద్ద యేడాది కనిష్టానికి చేరింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.81.81 వద్ద స్థిరపడింది.

## వేలానికి ల్యాంకో అమర్‌కంటక్ పవర్

**ముంబై, నవంబరు 23:** అప్పుల్లో కూరుకు పోయిన ల్యాంకో అమర్ కంటక్ పవర్ అమ్మకానికి సిద్ధమైంది. దీనిని వేలం పాటలో దక్కించుకునేందుకు రెండు ప్రధాన దిగ్గజ కంపెనీలు పోటీ పడనున్నాయి. దేశంలోని ఇద్దరు ధనవంతులైన గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ ముఖాముఖి పోటీలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి) కూడా ఆర్ఇసి లిమిటెడ్ భాగస్వామ్యంతో వేలంలో నిలబడింది. ప్రస్తుతం ముఖేష్ అంబానీ నేతృత్వంలోని




రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ బొగ్గు ఆధారిత పవర్ ప్రాజెక్ట్ కొనుగోలు రేసులో ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని కోసం కంపెనీ ముందస్తుగా ఆఫర్ చేసింది. రిలయన్స్ ఈ బిడ్‌ను గెలిస్తే, దీని ద్వారా కంపెనీ తొలిసారిగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి లోకి ప్రవేశిస్తుంది. నవంబరు 25న జరుగనున్న వేలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, అదాని పవర్ తలపడనున్నాయి. దేశంలోని రెండు అతిపెద్ద కార్పొరేట్ సంస్థలు ఒకరిపై ఒకరు నేరుగా పోటీపడడం ఇదే తొలిసారి. పవర్ ఫైనాన్స్ కార్ప్, రిలయన్స్ లిమిటెడ్ కన్సార్టియం కూడా ఈ బిడ్ ప్రక్రియలో పాల్గొంటుంది. ఈ బిడ్‌ను ఆర్ఐఎల్ దక్కించుకుంటే కంపెనీ తొలిసారిగా థర్మల్ విద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తుంది. రిజల్యూషన్ ప్లాన్ సమర్పణలో మొదటి రౌండ్‌లో ఆర్ఐఎల్ అత్యధిక బిడ్డర్‌గా నిలవగా, రెండో రౌండ్‌లో అదానీ పవర్ అగ్రస్థానంలో ఉందని నివేదికలో నిపుణులు తెలిపారు. పిఎఫ్‌సి- ఆర్ఇసి కన్సార్టియం రెండు రౌండ్లలో మూడవ స్థానంలో ఉంది. రెండో రౌండ్‌లో అదానీ రూ.2,950 కోట్లను బిడ్ చేసింది. అందులో 1800 కోట్ల రూపాయలు అడ్వాన్స్ పేమెంట్, మిగిలిన 1150 కోట్ల రూపాయలు ఐదేళ్లలో ఇవ్వనున్నారు. రిలయన్స్ రూ.2వేల కోట్లు ముందస్తు చెల్లింపు ప్రణాళికను రూపొందించింది. అయితే పిఎఫ్‌సి 10-12 సంవత్సరాలలో 3,870 కోట్ల రూపాయలు చెల్లించడానికి ఆఫర్ చేసింది. నవంబరు 25న నిర్వహించనున్న వేలానికి అత్యధిక ధర పలికిన అదానీ పవర్ ఆఫర్ చేసిన 2,950 కోట్ల రూపాయలు బేస్ ధర. ఐదు రోజుల పాటు జరిగిన 51వ కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ సమావేశంలో వేలం పాటను నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై ఇప్పటి వరకు ఆర్ఐఎల్, అదానీ, పిఎఫ్‌సి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.


## ఐనాక్స్ గ్రీన్ లిస్టింగ్



**ముంబై, నవంబరు 23:** విండ్ పవర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్వీస్ ప్రొవైడర్ అయిన ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ సర్వీసెస్ ఐపిఒ బుధవారం మార్కెట్లో లిస్టయింది. అయితే లిస్టింగ్ సమయంలో ఈ ఐపిఒ ఇష్యూ ధర కంటే తక్కువ ధరకు అంటే డిస్కౌంట్‌కు ఎక్ఛేంజీల్లోకి అరంగేట్రం చేసింది. ఎన్ఎస్ఇలో ఈస్టాక్ దాదాపు 8శాతం తగ్గింపుతో అంటే రూ.60.5, బిఎస్ఇలో దాదాపు రూ.60కి లిస్టయింది. స్టాక్ వాస్తవ ఇష్యూ బ్యాండ్ ధర రూ.61-65గా ఉంది. నవంబరు 11న ప్రారంభమైన ఈ ఐపిఒ ద్వారా కంపెనీ దాదాపు రూ.740కోట్లను సమీకరించింది. మార్కెట్లో స్టాక్ ఫ్లాట్‌గా లిస్టయింది. పునరుత్పాదక ఇంధన తయారీ రంగంలోని ఈ కంపెనీ ఐపిఒకు ఇన్వెస్టర్ల నుంచి మ్యూట్ రెస్పాన్స్ వచ్చిందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందుకే ఐపిఒ కేవలం 1.55 రెట్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది. ఇదే క్రమంలో నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన భాగం కేవలం 50 శాతం మాత్రమే సబ్‌స్క్రైబ్ చేయబడింది. రిటైల్ వ్యక్తిగత పెట్టుబడిదారులు 4.7 రెట్లుసబ్‌స్క్రైబ్ చేశారు. ఇష్యూలో రూ.370 కోట్ల విలువైన తాజా ఈక్విటీ విక్రయం మరియు దాని మాతృ సంస్థ ఐనాక్స్ విండ్ నుంచి అదే మొత్తంలో అమ్మకానికి ఆఫర్ ఉంది.

## వేదాంత మధ్యంతర డివిడెండ్ రూ.17.50

**న్యూఢిల్లీ, నవంబరు 23:** మైనింగ్ కంపెనీ వేదాంత లిమిటెడ్ మరోసారి భారీ డివిడెండ్‌ను వాటాదారులకు ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.17.50 చొప్పున 2022-23 సంవత్సరానికి మూడో మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని బోర్డు సమావేశంలో నిర్ణయించింది. ఈరూపంలో కంపెనీ రూ.6,505 కోట్లను చెల్లించనుంది. సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ స్థూల రుణ భారం రూ.58,597కోట్లుగా ఉంది. రుణాలు తీర్చడానికి బదులు వాటాదారులకు భారీ మొత్తంలో డివిడెండ్ ఇవ్వడానికి కంపెనీ ప్రాధాన్యం ఇచ్చింది. ఎందుకంటే కంపెనీలో ప్రమోటర్లకు పెద్ద మొత్తంలో వాటా ఉంది. దీంతో డివిడెండ్ రూపంలో



ప్రమోటర్లకు పెద్దమొత్తంలో నిధులు సమకూరనున్నాయి. డివిడెండ్ చెల్లింపునకు రికార్డ్ తేదీగా నవంబరు 30ని ప్రకటించింది. వేదాంత లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొదటి మధ్యంతర డివిడెండ్ కింద రూ.31.50, రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.19.50 చొప్పున ఇచ్చింది. ఈ మొత్తం కలిపి చూస్తే యేడాది కాలంలో 68.50 రూపాయల వరకు డివిడెండ్ కింద ఇచ్చింది.

## చైనా ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో ఉద్రిక్తత !

**బీజింగ్, నవంబరు 23:** చైనాలో కరోనా మరోసారి విజృంభిస్తోంది. రోజుకి దాదాపు 20వేలకుపైగా కేసులు నమోదవుతున్నట్లు అంతర్జాతీయంగా తెలిసింది. తాజాగా ఆపిల్ ప్రధాన తయారీ భాగస్వామి అయిన ఫాక్‌కాన్‌కు చెందిన యూనిట్లలో కార్మికులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న విడియోలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్‌తో పాటు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వీరిని నిలువరించేందుకు ప్రయత్నించిన సెక్యూరిటీ సిబ్బందితో వారు ఘర్షణకు దిగినట్లు తెలిసింది. దీంతో జెంగ్‌ఝౌలోని ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది. పరిస్థితిని




అదుపులోకి తెచ్చేందుకు నిరసనకారులపై బాష్పవాయువు కూడా ప్రయోగించినట్లు సోషల్ మీడియాతో విడియోలు చక్కర్లు కొడుతున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తమ వసతి గృహాల నుంచి బుధవారం వేకువజామున కార్మికులు ఒక్కసారిగా బయటకు వచ్చి నిరసనలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తప్పించుకొని పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న కొంతమంది కార్మికులపై సెక్యూరిటీ సిబ్బంది చేయిచేసుకుంటున్న విడియోలు దర్శనమిస్తున్నాయి. అయితే ఈ విడియోలను ధ్రువీకరించడానికి ఎలాంటి అధికారిక ఆధారాలు లేకపోవడం విశేషం. దాదాపు నెలన్నర క్రితం కొవిడ్ లాక్‌డౌన్లకు భయపడి అనేక మంది సిబ్బంది జెంగ్‌ఝౌ ప్లాంట్ నుంచి పారిపోయినట్లు వార్తలు వచ్చిన విషయం విదితమే. ఈ ప్లాంటులో దాదాపు రెండు లక్షలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో లక్ష మంది బయటకు వెళ్లిపోవడంతో కంపెనీ భారీ ఎత్తున కొత్త సిబ్బందిని నియమించుకుంది.

## డాక్టర్ రెడ్డీస్‌పై అమెరికాలో దావా

**వాషింగ్టన్, నవంబరు 23:** రెవ్‌లిమిడ్ ఔషధానికి సంబంధించి డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ (డిఆర్ఎల్)తో పాటు సెల్‌జీన్, బ్రిస్టల్ మయర్స్ స్క్విబ్ తదితర దేశీయ జనరిక్ ఔషధ కంపెనీలపై అమెరికాలో యాంటీ-ట్రస్ట్ దావా దాఖలైంది. రెవ్‌లిమిడ్ పేటెంట్ వివాద పరిష్కార విషయంలో ఆయా సంస్థలు వ్యవహరించిన తీరును తప్పుబడుతూ నవంబరు 18న ఈ దావా దాఖలైనట్లు డిఆర్ఎల్ వెల్లడించింది. తమపై ఆరోపణల్లో ఎలాంటి పస లేదని, లిటిగేషన్‌ను దీటుగా ఎదుర్కొంటామని డిఆర్ఎల్ స్పష్టం చేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.